

కొండపై ప్రముఖులు

కొండగట్టు : కరీంనగర్ సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి వాణి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



శనగల కొనుగోళ్లపై కిరికిరి

కథలాపూర్ : జిల్లాలో కేవలం 540 క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. - 8లో

గరిష్టం/కనిష్టం
36.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గం

జగిత్యాలఅగ్రికల్చర్: మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ములాస్తపు రాజేందర్, అధ్యక్షుడిగా పాత సుధాకర్, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి శ్రీనివాస్, జి.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా బూసారపు శ్రీనివా స్‌గౌడ్, కార్యదర్శిగా నలుమాసు రాజశేఖర్, కోశాధికారిగా చెట్‌పల్లి రాజమల్లయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఉమాపతి, సుధాకర్, మహేశ్ బాబు, రవీందర్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఎన్నికల కోలాహలం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణ పద్మశాలీ సేవా సంఘంలో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఈనెల 12న ఎన్నికలు నిర్వహించడానికి ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. అధ్యక్ష పదవికి మాజీ అధ్యక్షులు ధ్యావనపల్లి రాజారాం, జోగ రాజగంగారాం, గాజెంగి సుదర్శన్ పోటీ పడుతున్నారు. వచ్చే ఆదివారం ఎన్నికలు జరిపి.. అదే రోజు సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం ముగ్గురు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పట్టణ ఓటర్లలో అత్యధికంగా పద్మశాలీలు ఉన్నారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పద్మశాలీల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.

శక్తిశాలి భారత్ నిర్మిస్తాం



కార్యకర్తల మార్చ్‌ఫాస్ట్

జగిత్యాల: శక్తిశాలి నిర్మాణమే తమ సంస్థ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహ భౌతిక్ ప్రముఖ్ శివకుమార్‌జీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో శారీరిక్ ప్రధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దేశభక్తి పౌరులుగా తీర్చిదిద్దే పనిని ఆర్‌ఎస్‌ఎస్ చేస్తోందన్నారు. అతి ప్రాచీన, గొప్ప సంస్కృతి, జీవన విలువలు కలిగిన మనదేశం ఏనాడూ విదేశాలపై దాడులు చేయలేదని అన్నారు. ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టి విశ్వగురువుగా విరాజిల్లిందని పేర్కొన్నారు. మనదేశంపై దాడి చేస్తే మన ప్రతాపం చూపడంలో వెనుకంజ వేయలేదని అన్నారు. అనంతరం ప్రధాన వీధుల గుండా రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ భీంనాథిని శంకర్, సహ సంఘ్‌చాలక్ శ్రీనివాస్‌రెడ్డి, సంఘ్ చాలక్ జిడిగె పురుషోత్తం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి పాల్గొన్నారు.

'ప్రభుత్వాన్ని గద్దె దించుతాం'



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: రాష్ట్రంలో రైతువ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ. భూటకపు హామీలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్.. రైతులను మోసం చేసిందన్నారు. ఏకకాలంలో రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫసల్ బీమా యోజన ప్రవేశపెడితే రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయడంలేదన్నారు. ఈనెల ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని ఆయన తెలిపారు. నాయకులు ముత్యంరెడ్డి, సత్యనారయణ, పన్నాల తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవలలకు అరుదైన గౌరవం



బిరుదుతో కవలలు

మల్యాల(చొప్పదండి) : తక్కళ్లపల్లికి చెందిన కవలలు దూపం శివ ప్రసాద్‌శాస్త్రీ, శివకుమార్ శాస్త్రీ వీరశైవ పురోహిత రత్న బిరుదు అందుకున్నారు. సీవీ రామన్ అకాడమీ సాంస్కృతిక సేవా సంస్థ, రుద్రాక్ష వైభవం, తక్కళ్లపల్లికి చెందిన దూపం గంగయ్య కుమారులు శివకుమార్‌శాస్త్రీ, శివప్రసాద్‌శాస్త్రీ పురోహిత్యం, విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. వారి సేవలను గుర్తించిన సీవీ రామన్ అకాడమీ సంస్థ.. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బిరుదుతో గౌరవించారు. సువర్ణ కంకణధారణ చేశారు.

తాగునీటికి తపిస్తున్నాం..

'బ్రహ్మోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి.. అన్ని సౌకర్యాలు కల్పించాలి'

- అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాలు

- చెట్ల నీడ, మెట్ల ఆవరణే దిక్కు..!
- తూతూమంత్రంగా ఏర్పాట్లు
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భక్తులకు తప్పని తిప్పలు
- కలెక్టర్ సూచనలు బేఖాతరు!



గోదావరి నదిలోని ప్రమాదకరమైన ఈ ప్రాంతంలో ఇనుప జాలీలు ఏర్పాటు చేయాల్సి ఉంది

ధర్మపురి: కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో రెండుసార్లు నిర్వహించిన సమన్వయ సమావేశంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని తలూపిన అధికారులు.. నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు గడిచినా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారు. దీంతో నృసింహుని బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 3న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 13రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తారు. వసతులు కల్పించాల్సిన వివిధ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు.

అధికారులు చేపట్టిన పనులు..

చలువ పందిళ్లు : గోదావరి తీరంలోని మెట్ల వద్దే ఏర్పాట్లు చేశారు. అవి భక్తుల సంఖ్యకు సరిపోవడంలేదు. చెట్లనీడ, పుష్కరఘాట్ మెట్లు, రోడ్ల వెంట సేద దీరుతున్నారు.

తాగునీరు : ఎక్కడ భక్తులు ఉన్నా.. అక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనే దానికి భిన్నంగా మంగళిగడ్డ మెట్లపై ఒకటే ఏర్పాటు చేశారు. అదికూడా చల్లటి నీరుకాదు.

బయోల్యాట్రిన్ : దీనిని మెట్లపై ఏర్పాటు చేశారు. అంతదూరం వెళ్లడానికి మహిళలు, పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మరోవిషయం ఏమిటంటే.. గత పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన పాత బయోల్యాట్రిన్‌నే అందుబాటులోకి తెచ్చారు. బస్టాండ్, కూరగాయల మార్కెట్‌లోని పాతవి తప్ప కొత్తగా ఏర్పాటు చేసినవేమీలేవు. నిర్వహణ లోపంతో అవికూడా కంపుకొడుతున్నాయి.

గోదావరితీరంలో ఏర్పాట్లు : సంతోషిమాత ఘాట్ వద్దే తాడు కట్టి చేతులు దులుపుకున్నారు. లోతుగా ఉండి, ప్రమాదకరంగా మారిన మంగళిగడ్డ ఘాట్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. హన్మాన్‌గుడి వద్ద భక్తులు లోనికి వెళ్లకుండా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

పారిశుధ్యం : గోదావరి తీరంతోపాటు పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిత్యం పారిశుధ్య పనులు చేస్తున్నారు.

అన్నదానం : బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు దాతల సహకారంతో బ్రాహ్మణ సంఘం, ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో నిత్యాన్నదానం చేస్తున్నారు.

వైద్యశిబిరాలు : నాలుగుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గోదావరి తీరంలో తాత్కాలిక షెడ్లు నిర్మించారు.

నిరంతర విద్యుత్ : పూజలకు అంతరాయం కలుగకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నారు.



విద్యుత్ వెలుగుల్లో నృసింహుని ఆలయం



అన్నదాన సత్రంలో భక్తుల రద్దీ

కలెక్టర్ సూచనలు ఇవే..

- భక్తులకు నీడ కల్పించి, చల్లని మినరల్ వాటర్ అందించాలి
- ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు విరివిగా ఏర్పాటు చేయాలి
- గోదావరి తీరంలో రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలి.
- ముఖ్యంగా గోదావరిలోని లోతట్టు ప్రాంతాలకు భక్తులు వెళ్లకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేయాలి
- బయోల్యాట్రిన్లు అందుబాటులోకి తేవాలి
- నిత్యాన్నదానం, నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి.



సంతోషిమాత ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన తాడు

భోజనం బాగుంది



నృసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా ధర్మపురి వచ్చినం. నృసింహునికి మొక్కులు చెల్లించినం. దాతలు రుచికరమైన భోజనం పెట్టారు.

– లక్ష్మి, భక్తురాలు, ఆర్మూర్

మరుగుదొడ్లతో ఇబ్బంది



గోదావరి తీరంలో సరిపడా మరుగుదొడ్లు లేవు. ఉన్న ఒక్క బయో ల్యాట్రిన్ చాలామందికి సరిపోవడంలేదు. మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– సుజాత, భక్తురాలు, నిజామాబాద్

తాగునీటికి గోస



గోదావరి తీరంలో తాగునీటి కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చల్లటినీళ్లు అందించాల్సి ఉంది. మరికొన్నిచోట్ల ఏర్పాటు చేయాలి.

– వసంత, భక్తురాలు, భీంగల్, ఆర్మూర్

వసతులు కల్పించాం



నృసింహుని బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు వసతులు కల్పించాం. ఆలయంలో తాగునీరు, చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

– శ్రీనివాస్, ఆలయ ఈవో

అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు పనులు

- ఇక్కడే కుర్చీలేసుకొని కూర్చుండి పూర్తి చేస్తాం
- నాడు ఓట్ల కోసం పనులు ప్రారంభించిన హరీశ్‌రావు, రమేశ్‌బాబు
- గెలిచిన తర్వాత తట్టెడు మట్టి తీయలే..
- కేసీఆర్ పాలనలో బంధువులు, తెలంగాణ ద్రోహులకే పదవులు
- హాథ్ సే హాథ్ జోడోయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



కథలాపూర్ మండలం కలిగోట సూరమ్మ రిజర్వాయర్ వద్ద మ్యాప్ పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

కథలాపూర్/రుద్రంగి(వేములవాడ): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు వద్ద కుర్చీలేసుకొని కూర్చుండి పనులు పూర్తి చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలిపారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా ఆయన జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలిగోట శివారు, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో నిలిచిపోయిన సూరమ్మ ప్రాజెక్టు పనులను ఆ దివారం పరిశీలించారు. 2018 ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు ఆగమేఘాల మీద అప్పటి నీటి పారుదల మంత్రి హరీశ్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, గెలిచాక తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబం, బంధువులు, తెలంగాణ ద్రోహులకే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు వచ్చాయన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపెల్లి మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు

వేములవాడఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం–సంకెపల్లి గ్రామాల నుంచి ప్రారంభమైన యాత్ర అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, తిప్పాపూర్ మీదుగా వేములవాడ రాజన్న ఆలయం వరకు కొనసాగింది. ములుగు ఎమ్మెల్యే సీతక్క, మండల నాయకులు తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ..

వేములవాడ మండలం అనుపురం శివారులో సంచార కుటుంబాల సమస్యలను రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు. ఇండ్లు లేవని వారు చెప్పడంతో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కట్టిస్తామని తెలిపారు. నాంపల్లి గ్రామంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు వినతిపత్రం అందించారు. కాగా అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా గ్రామాల్లోని మిడ్ మానేరు ముంపుగ్రామాల నిర్వాసితులు రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. తమకు పూర్తిగా నష్టపరిహారం అందలేదన్నారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, రూ.5.04 లక్షలతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు.

చింతాల్‌ఠాణాలో టీ..

రేవంత్‌రెడ్డి చింతాల్‌ఠాణాలో పొత్తూరి దేవయ్య ఇంట్లో టీ తాగారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఏం అభివృద్ధి జరిగింది, మీకు ఏం న్యాయం జరిగింది.. ముంపు గ్రామాల్లో సమస్యలు ఏమన్నా ఉన్నాయా అని రేవంత్‌రెడ్డి అడుగగా.. 'అయ్యా.. మంచిగా ఉన్న ఊరిలో ప్రాజెక్టు కట్టి ఇండ్లను తీసుకువచ్చి ఈ సీసీరోడ్ల మీద వేసింద్రు. ఇప్పటికీ పూర్తి పరిహారం రాలేదని' వాపోయారు. అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.



మల్లన్నకు బోనాలు..

కథలాపూర్(వేములవాడ): చింతకుంటలో మల్లికార్జునస్వామి బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల దేవాలయం నిర్మించారు. నాలుగు రోజుల క్రితం మల్లికార్జునస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాగా ఆదివారం గ్రామం నుంచి దేవాలయం వరకు గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

15వేల మంది విద్యార్థులు..29 కేంద్రాలు

- ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- 15నుంచి నిర్వహణకు సన్నద్ధం



కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

కథలాపూర్(వేములవాడ): ఇంటర్ వార్షిక పరీక్షలు ఈనెల 15న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఫస్టియర్, 16వ తేదీ నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తారు. అయితే, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ తెలిపారు. రోజూ ఉదయం 9 – మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

15,972 మంది విద్యార్థులు.. 29 కేంద్రాలు..

- జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వెల్గటూర్ మోడల్ స్కూల్, 13 ప్రైవేట్ జూనియర్ కళాశాల్లో కలిపి మొత్తం 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.
- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 71 ఉన్నాయి.
- ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 15, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 26, మోడల్ స్కూల్ కళాశాలలు 13, వివిధ సంక్షేమ శాఖలకు సంబంధించినవి 15 కళాశాలలున్నాయి.
- ఫస్టియర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 7,389 మంది, సెకండియర్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు చెందిన 8,583 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని అధికారులు తెలిపారు.
- విద్యార్థులకు సౌకర్యంగా పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని బాధ్యులకు సూచించామని జిల్లా అధికారులు తెలిపారు.

వైద్య, పోలీసు అధికారుల సహకారం

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని విద్యాశాఖతోపాటు వైద్య, పోలీస్ అధికారుల సహకారం తీసుకుంటున్నామని జిల్లా ఇంటర్ విద్య అధికారులు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించేలా ఏఎన్‌ఎంతోపాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయిస్తామని అధికారులు వివరించారు.

అందని కాస్మొటిక్ చార్జీలు

- ఇబ్బందుల్లో కేజీబీవీల విద్యార్థినులు



పెగడపల్లి కేజీబీవీలోని విద్యార్థినులు

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల(కేజీబీవీ) విద్యాలయాల్లోని విద్యార్థినులకు కరోనా తర్వాత కాస్మొటిక్ చార్జీలు అందడంలేదు. వ్యక్తిగత బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలు తెరిచినా అందులో డబ్బు జమకావడంలేదు. దీంతో బాలికలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

అనాథలు.. పేదలే..

- జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో అనాథ, పేద కుటుంబాల బాలికలే చదువుకుంటున్నారు.
- ఆరు నుంచి పదో తరగతి వరకు, కొన్నిచోట్ల ఇంటర్ కోర్సులు చదువులు అందిస్తున్నారు.
- ఉచితంగా యూనిఫామ్స్, భోజనం, వసతి అందించడంతోపాటు కాస్మొటిక్ చార్జీల కింద ప్రతినెలా రూ.100 చొప్పున విద్యార్థినులకు ప్రభుత్వం చెల్లించేది.
- 2018 నుంచి నగదుకు బదులు పౌడర్, సబ్బు, కొబ్బరినూనె తదితర వస్తువులు కలిపి కాస్మొటిక్ కిట్లు అందజేసింది.
- కరోనా ప్రభావం తర్వాత ఈ కిట్లు కూడా అందజేయడంలేదు.
- ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ విద్యార్థినులకు కిట్లు అందజేయలేదు. కనీసం నగదు కూడా చెల్లించడంలేదు.
- అయితే, కాస్మొటిక్ కిట్లస్థానంలో బాలికల బ్యాంకు, తపాలా ఖాతాల్లో నగదు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఏఎస్‌వోలు రంగంలోకి దిగి ఖాతాలు తెరిపించారు.
- రెండు నెలల క్రితం ప్రభుత్వానికి బ్యాంకు ఖాతాల జాబితా పంపించారు.
- విద్యార్థినుల ఖాతాల్లో నేటికీ పైసా జమకాలేదు.

16 కేజీబీవీలు.. 2,600మంది విద్యార్థినులు

పాతవి 14తోపాటు ఇటీవల బీర్‌పూర్, బుగ్గారంలో ఏర్పాటు చేసినవాటితో కలిపితో జిల్లాలో మొత్తం కేజీబీవీలు 16కు చేరాయి. ఇందులో సుమారు 2,600 మంది బాలికలు చదువుకుంటున్నారు. జగిత్యాల అర్బన్, వెల్గటూర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, రాయికల్‌లో ఇంటర్ కోర్సులు నిర్వహిస్తున్నారు. 2018లో ఒక్కొక్కరికి నెలకు రూ.100 చొప్పున కాస్మొటిక్ చార్జీలు చెల్లించగా, ప్రస్తుతం ఎంత సొమ్ము చెల్లిస్తారనే దానిపై స్పష్టత లేదు.

చార్జీలు ఇవ్వండి



కాస్మొటిక్ కిట్ల కోసం ప్రభుత్వం గతంలో వంద రూపాయలు ఇచ్చేది. తర్వాత పౌడర్, సబ్బు, కొబ్బరినూనె, ఇతర వస్తువులతో కూడిన కిట్లు ఇచ్చింది. కరోనా తర్వాత నుంచి ఏవీ ఇవ్వడంలేదు.

– వైష్ణవి, పదోతరగతి, పెగడపల్లి

ఇబ్బందిగా ఉంది



మాది పేద కుటుంబం. చదువు కోసం కేజీబీవీల్లో అన్నివసతులు ఉన్నయ్. కానీ, కాస్మొటిక్ చార్జీలు వస్తలెవ్వు. చాలా ఇబ్బందిగా ఉంది. బయట కొనుగోలు చేసే పరిస్థితి లేదు.

– నిత్య, ఏడోతరగతి, పెగడపల్లి

నివేదించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు కేజీబీవీల్లోని విద్యార్థినులతో వ్యక్తిగత బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలు తెరిపించాం. నివేదికను ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కా గానే ఖాతాల్లో జమచేస్తాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మహోర్ రేణుకామాత శక్తిపీఠం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవిశంకర్,

మాల్యాలు: రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మహారాష్ట్రంలోని మహోర్ రేణుకామాత శక్తిపీఠం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ మల్యాల మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, చింతపంటి యాదయ్య, మారంపల్లి నారాయణ, తదితరులున్నారు.

ఆర్థిసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మల్లాపూర్ : మండలంలోని కొత్తదాం రాజుపల్లికి చెందిన సుంకె గణేశ్ (35) గతనెల 20న కువైట్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణేశ్‌తో మల్లాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.26,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి తమవంతు అందించినట్లు తెలిపారు.

అంజలి గ్రూప్ కో ఆర్డినేటర్‌గా సాకేత



సాకేత

జగిత్యాల: హన్మకొండకు చెందిన అంజలి గ్రూప్ ఫౌండేషన్ జగిత్యాల జిల్లా మహిళా కో ఆర్డినేటర్‌గా సామాజిక సేవకురాలు నమిలకొండ సాకేత నియామకమయ్యారు. ఈ మేరకు ఫౌండర్ రాజు ఉత్తర్వులు జారీచేశారు. నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు.

రాజన్న సేవలో కేంద్ర వాణిజ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని ఆదివారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దూలం రవితేజ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం ఆయనను ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ సత్కరించారు.

ఫుడ్ రిజిస్ట్రేషన్లు ఎక్కడ..?

- ఇష్టానుసారంగా తినుబండారాల స్టాళ్లు
- రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు
- పట్టించుకోని అధికారులు



తినుబండారాలు

జగిత్యాల: ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 ప్రకారం తినుబండారాలతో పాటు ఏ వ్యాపారం చేయాలన్నా ఫుడ్ లైసెన్స్ తప్పనిసరి. నెలకు రూ.లక్షకన్నా తక్కువ, ఏడాదికి రూ.12 లక్షల లోపు వ్యాపారం చేసేవారు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రధాన మున్సిపాలిటీలైన జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్లలో ఎక్కడబడితే అక్కడ మిర్చీల బండ్లు, ఇటీవల చైనీస్ ఫుడ్స్, పానీపూరీ, టీస్టాళ్లు వెలుస్తున్నా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు.

గుర్తింపు కోసమే

ఏదైనా తినుబండారాల వద్ద నాణ్యత లేకున్నా, కల్తీ జరిగినా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు. ఒకచోట ఏర్పాటు చేసి వ్యాపారం నడవకపోతే మరోచోట ఏర్పాటు చేసుకుంటే ఇదే రిజిస్ట్రేషన్ గుర్తింపు లభిస్తుంది. ఏడాదికి రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

అవగాహన లేకపోవడమే

కొంతమంది వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు. దీంతో ఎక్కడబడితే అక్కడ ఇష్టానుసారంగా వ్యాపారాలు నడిపిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పెద్దున జరుగుతున్నాయి.

60కి పైగా మాత్రమే లైసెన్స్‌లు

చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు రిజిస్ట్రేషన్ చేసుకుంటుండగా ఏడాదికి రూ.12 లక్షలకు పైగా వ్యాపారం చేసేవారు రూ.వెయ్యి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.12 లక్షలకుపైగా చేసేవారు రూ.2 వేలు, మ్యానుఫ్యాక్చరింగ్ చేస్తే రూ.5వేలు పెట్టి లైసెన్స్ పొందాలి. ఇటీవల అధికారులు అవగాహన కల్పించగా జగిత్యాలలో మాత్రమే 60కి పైగా లైసెన్స్‌లు అందించినట్లు తెలిసింది.

అంతా కల్తీ..

నాసిరకమైన ఆహారం తినడంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. మరోవైపు విక్రయిదారులు ఎలాంటి రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అధికారులు ఎక్కడ తనిఖీలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగిపై ఆరోపణలు

ఈ శాఖలో గతంలో ఉద్యోగిగా పనిచేసిన ఓ అధికారి మళ్లీ ఆ శాఖలోనే పనిచేస్తూ వివిధ దుకాణాల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలోనూ ఈ అధికారిపై ఆరోపణలు వచ్చాయి. లైసెన్సుల జారీల విషయంలో అనేక అవకతవకలు సైతం జరుగుతుంటాయని విశ్వసనీయంగా తెలిసింది.

రిజిస్ట్రేషన్, లైసెన్స్‌లు పొందాలి

తినుబండారాలకు సంబంధించిన వ్యాపారులు తప్పనసరిగా రిజిస్ట్రేషన్, లైసెన్స్‌లు పొందాలి. దీనిపై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

–బాపూజీ, ఫుడ్ డిజిగ్నేటరీ అధికారి

బార్బీ బొమ్మలకు భలే డిమాండ్



కోరుట్ల మెయిన్ రోడ్డు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న బార్బీ బొమ్మలు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంతటా అమ్మకాలు
- 20 కుటుంబాలకు ఉపాధి

కోరుట్లటౌన్: బార్బీ బొమ్మ చూస్తే చాలు చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. వీటితో ఆడుకునేందుకు పిల్లలు ఆసక్తి కనబరుస్తుంటారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ప్రతి ఆదివారం ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వీధి వ్యాపారులు బార్బీ బొమ్మలను విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధానంగా కరీంనగర్, వేములవాడ, పెద్దపెల్లి, కొండగట్టు, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో బార్బీ బొమ్మల వీధివ్యాపారం పాపులర్‌గా మారింది. 20 కుటుంబాలు ఈ బొమ్మలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. కోరుట్ల మున్సిపల్ కేంద్రం మెయిన్ రోడ్డులో బార్బీ బొమ్మలను విక్రయిస్తున్న ఆకాష్‌ను ఆదివారం సాక్షి పలకరించింది. క్లాత్, లేస్‌లు, అట్టల అతికించి తయారు చేస్తుట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా అంతటా ప్రతి ఆదివారం విక్రయాలు చేపడుతున్నట్లు ఆకాష్ తెలిపారు. ఒక్కో బార్బీ బొమ్మ రూ.150 నుంచి రూ. 250 వరకు విక్రయిస్తున్నామన్నారు. డిజైన్ వర్క్, సైజుల ఆధారంగా అమ్మకం ధర నిర్ణయిస్తామని తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా బార్బీ బొమ్మలకు ప్రత్యేక అలంకరణ చేసే పనిలో 20 కుటుంబాలు రోజువారీగా కూలీపని చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో బార్బీ బొమ్మ తయారీ సైజును బట్టి రూ.20 నుంచి రూ.25 వరకు తీసుకుంటారని తెలిపారు.

ప్రతి ఆదివారం విక్రయిస్తాం



బార్బీ బొమ్మలకు భలే డిమాండ్ ఉంది. ప్రతి ఆదివారం 60 బార్బీ బొమ్మల వరకు అమ్ముతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన కూడళ్లు, మెయిన్ రోడ్ల వద్ద విక్రయిస్తున్నాం. వ్యాపారంలో 20 కుటుంబాలకు పని దొరకడం సంతోషంగా ఉంది.

– ఆకాష్, బార్బీ బొమ్మల అమ్మకందారుడు

రైలుకిందపడి మహిళ మృతి

- ప్రాణాలతో బయటపడ్డ ఎనిమిదేళ్ల బాలుడు
- సింగరేణి రైలులో కిక్కిరిసిన ప్రయాణికులు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా మధ్య పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో కాల్వశ్రీరాంపూర్ మండల పరిధిలోని ఆరెపల్లి జీపీ అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లెకు చెందిన శ్రీమంతుల భాగ్యమ్మ(55) మహిళ సింగరేణి రైలుకిందపడి ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మల్లయ్యపల్లెకు చెందిన భాగ్యమ్మ తన ఎనిమిదేళ్ల మనవడితో పొత్కపల్లి నుంచి రవీంద్రఖనికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వచ్చిన రైలులో మనవడితో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీకింద పడడంతో కాళ్లుచేతులు తెగి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. చేతిలో ఉన్న మనవడిని మాత్రం బయటకు నెట్టివేయడంతో ప్లాట్‌ఫాంపై పడి ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పొత్కపల్లి రైల్వేస్టేషన్లో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని రామగుండం జీఆర్పీఎఫ్ పోలీసులు సందర్శించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భాగ్యమ్మ మృతి వార్త తెలియడంతో స్వగ్రామైన కాల్వశ్రీరాంపూర్ మండలం మల్లయ్యపల్లెలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

చేపలవేటకు వెళ్లి యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్నకుటుంబ సభ్యులు

కోనరావుపేట (వేములవాడ) : చేపలవేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. మండలంలోని నిజామాబాద్ శివారులోని ఎలమ్మకుంటలో పదిమందితో కలిసి ఉప్పుల రామస్వామి– గౌరవ్వ దంపతుల కుమారుడు శ్రీకాంత్ (25) కూడా వెళ్లాడు. శ్రీకాంత్ చెరువులోకి కొద్దిదూరం వెళ్లగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తోటివారు గమనించి గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. అయితే చెరువులోని కందకంలో పడి చనిపోయాడా..లేక గుండెపోటుతో మృతిచెందాడా తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వైస్ ఎంపీపీ వంగపెల్లి సుమలత పరామర్శించారు.



శ్రీకాంత్ (ఫైల్)

మెరుగైన వైద్యం అందక ఒకరు..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): కూలీ పనులు చేస్తే తప్ప.. పూటగడవని ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన సంపంగి రాజు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్ది రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ఇప్పటికే రూ.3 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చుచేశారు. మెరుగైన వైద్యం అందించేందుకు స్థోమత లేకపోడంతో రెండురోజుల కింద ఇంటికి తీసుకురాగా ఆదివారం మృతిచెందాడు. మృతుడికి తండ్రి మల్లయ్య, సోదరి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నర్సగౌడ్, ఎపీటీసీ మధు, గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెగడపల్లి: జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన పన్నటి లక్ష్మీ (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. శనివారం రాత్రి ఎప్పటిలాగే కుటుంబ సభ్యులతో పాటు భోజనం చేసింది. ఉదయం చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలోని పలుచోట్ల వెతకగా గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. అనారోగ్యంతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు.

మట్టి రవాణా చేస్తున్న ట్రక్కు స్వాధీనం

మల్లాపూర్(కోరుట్ల): ఒబులాపూర్ నుంచి రాఘవపేటకు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ట్రక్కును రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. దానిని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కాగా, వారంరోజులుగా మట్టి అక్రమంగా తరలిస్తున్న ట్రక్కుకు స్వాధీనం చేసుకున్న అధికారులు.. అందులోకి మట్టి నింపుతున్న జేసీబీని సీజ్ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన గంగారాం

కోరుట్ల రూరల్ : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బోయినిపెల్లి గంగారాం మేడిపెల్లి వైపునుంచి మోహన్‌రావుపేటకు టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగారాంకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శేషప్ప కళావేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ కళాకారులు పలురకాల ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇందారపు రామన్న, ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది అలువాల శ్రీనివాస్, వావిలాల తిరుపతి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

- బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు
- ఈతకొడుతూ గల్లంతైన వైనం
- మరో యువకుడు క్షేమం



గల్లంతైన వ్యక్తి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

మానకొండూర్: బంధువుల ఇంట్లో జరిగే దైవ కార్యక్రమానికి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కరీంనగర్‌కు వచ్చిన ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మురారి రితికేష్ (23) యువకుడు ఐఐటీ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ ఖరగ్‌పూర్ నుంచి శనివారం రాత్రి కరీంనగర్‌లో ఉంటున్న తన అమ్మమ్మ, మేనమామల ఇంటికి చేరుకున్నాడు. రాత్రి బంధువుల ఇంట్లో నిర్వహించిన దైవకార్యక్రమంలో (దుర్గమ్మ కొలుపు) పాల్గొన్నాడు. ఉదయాన్నే నిద్రలేచి తన మేనమామ డోలిశ్రీనివాస్, డోలి ప్రసాద్, డోలి బద్రినాత్, డోలి జతిన్‌తో కలిసి మురారి రితికేష్ సరదాగా ఈతకు వెళ్దామని మానకొండూర్ మండలంలోని ఈదులగట్టిపల్లికి కారులో వెళ్లారు. గ్రామ శివారులో కల్లుతాగి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ర్యాంపు వద్ద ఈతకొడుతుండగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రితికేష్‌తో పాటు, జతిన్ (20) ఇద్దరు నీటిలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న శ్రీనివాస్, ప్రసాద్ జతిన్‌ను కాపాడారు. ఇంతలోనే రితికేష్ నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. జతిన్ క్షేమంగా ప్రమాదం నుంచి బయట పడగా రుతికేష్ నీటిలో గల్లంతవడంతో మేనమామలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేయించి జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రితికేష్ తండ్రి రాజేందర్ పదేళ్లక్రితం మృతిచెందగా, తల్లి భవానీ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఓ చెల్లి కూడా ఉందని సమాచారం.

శనగల కొనుగోళ్లపై కిరికిరి

- 540 క్వింటాళ్ల సేకరణకే అనుమతి
- జిల్లాలో ఒక్కటే కొనుగోలు కేంద్రం
- అయోమయంలో అన్నదాతలు



దూలూర్ కొనుగోలు కేంద్రంలో శనగలు

కథలాపూర్(వేములవాడ): రైతులు పండించిన శనగలు దళారుల పాలు కాకుండా మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లాలోని కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. ఇదంతా బాగానే ఉన్నా జిల్లానుంచి 540 క్వింటాళ్ల శనగలనే కొనుగోలు చేయాలని అనుమతి వచ్చిందని అధికారులు స్పష్టం చేశారు. అయితే, తమవద్ద ఉన్న మిగతా శనగలను ఎలా విక్రయించేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం 294 ఎకరాలు..

- జిల్లాలో ఈ సీజన్‌లో 294 ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు వ్యవసాయశాఖ రికార్డుల్లో ఉంది.
- పంట సాగుచేసిన రైతులకు అన్ని అంశాలు అనుకూలిస్తే ఎకరాపై 8 క్వింటాళ్ల– 9 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.
- పంటకు నీటి అవసరం తక్కువ. అందుకే జిల్లాలోని కథలాపూర్ మెట్ట ప్రాంతంలోనే దీనిని సాగు చేశారు.
- ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335 చెల్లిస్తామని ప్రకటించింది.
- గతేడాది రూ.5,230 ఉండగా... ఈసారి రూ.105 పెంచడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- అయితే, దళారులు క్వింటాలుకు రూ.4 వేల – రూ.4,500కు మించి ధర చెల్లించడంలేదని రైతులు వాపోతున్నారు.

540 క్వింటాళ్ల కొనుగోళ్లకే అనుమతి..

జిల్లాలో శనగను 294 ఎకరాల్లో సాగు చేయగా... నాఫెడ్ మాత్రం ఎకరాకు 6.20 క్వింటాళ్ల చొప్పున దిగుబడిగా భావించి 540 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న కొనుగోళ్ల లక్ష్యం ఏ మేరకు సరిపోదు. కొందరినుంచి కొనుగోలు చేసి మిగతా వారికి వదిలేస్తే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని సహకార సంఘం అధికారులు చెబుతున్నారు.

ఎకరాకు 9 క్వింటాళ్ల దిగుబడి



ఈ సీజన్‌లో ఎకరంలో శనగ పండించిన. 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మా ఊరులోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో సంబరపడిన. కానీ ఎకరాకు 6.20 క్వింటాళ్లే మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని షరతులు పెట్టడం దారుణం. ఇట్లయితే దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోవుడు ఖాయం. మాతో చెలగాటమాడవద్దు. మొత్తం శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.

– గోపిడి ధనుంజయ్‌రెడ్డి, రైతు, దూలూర్

ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం



రైతులకు చేరువలో కొనుగోలు కేంద్రం ఉండాలనే లక్ష్యంతో దూలూర్‌లో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. జిల్లాలో 540 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేయాలని నాఫెడ్ నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మొత్తం కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని నాఫెడ్‌కు ప్రతిపాదనలు పంపించాం.

– దివ్యభారతి, మార్క్‌ఫెడ్ డీఎం